సాక్షి తిరుపతి

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



సత్యవేడు టీడీపీలో అయోమయం!

సత్యవేడు నియోజకవర్గ టీడీపీలో వర్గపోరు కారణంగా కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. - 8లో



ప్రైవేట్ టెండర్లతో ఏపీ సీడ్స్ నిర్వీర్యం

ఏపీ సీడ్స్ కార్పొరేషన్‌ను ప్రైవేట్ టెండర్లతో నిర్వీర్యం చేశారని ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి ఆరోపించారు. - 8లో



ముగ్గురు ఎర్రదొంగల అరెస్ట్

చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలు మార్గంలో ఎర్రచందనం తరలిస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

బస్టాండ్‌లో అధిక ధరలకు వస్తువుల విక్రయం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ప్రయాణికులు



అధికారులకు సూచనలు చేస్తున్న డీపీటీఓ జగదీష్

తిరుపతి అర్బన్: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆహార పదార్థాలు, వస్తువులు ఎమ్మార్పీ ధరలకు విక్రయించడంలేదని పలువురు ప్రయాణికులు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీపీటీఓ జగదీష్ ఆదివారం బస్టాండ్‌లో డీఎం బాలాజీతో పాటు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరానికి దేశవిదేశాల నుంచి భక్తులు వచ్చిపోతుంటారని, ఈ క్రమంలో వారితో మర్యాదగా మెలగాలని చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన ధరలకే వస్తువులను విక్రయించాలని ఆదేశించారు. దుకాణదారులకు కేటాయించిన స్థలంలో మాత్రమే వ్యాపారం చేసుకోవాలని స్పష్టం చేశారు. మరోవైపు ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద అడ్డదిడ్డంగా వాహనాలు ఉంచడం ద్వారా ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్టాండ్‌లోని నాలుగు మరుగుదొడ్లు ఉన్నాయని, అయితే బెంగళూరు పాయింట్ వద్ద ఉన్న మరుగుదొడ్డిలో మాత్రమే యూరిన్‌కు రూ.2 వసూలు చేయాలని, మరుగుదొడ్డికి రూ.3 వసూలు చేయాలని చెప్పారు. మిగిలిన మూడు పాయింట్లలో యూరిన్‌కు వెళ్లడానికి ఉచితమని, మరుగుదొడ్డికి మాత్రమే రూ.3 తీసుకోవాలని స్పష్టం చేశారు.

నేటితో ముగియనున్న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీలలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ వంటి పీజీ కోర్సులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. ఈ మేరకు ఇప్పటికే ఆయా వర్సిటీల డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయ అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఏపీ పీజీసెట్–2024లో అర్హత సాధించి, గత రెండు విడతలలో జరిగిన అడ్మిషన్ల ప్రక్రియలో సీట్లు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఆయా వర్సిటీల అడ్మిషన్ల కార్యాలయాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జూలైలో జరిగిన ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ, ఎమ్మెస్సీ ఇండస్ట్రియల్ మైక్రో బయాలజీ నాల్గొవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.దామ్లానాయక్ తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తప్పుకుంటావా.. దుకాణం అప్పగిస్తావా?

చిల్లకూరు: 'నువ్వు మమ్మల్ని కాదని ఎక్కడ మద్యం దుకాణం నిర్వహిస్తావో చూస్తాం. నువ్వొక్కడివే ఏం చేస్తావ్. నీ దుకాణాన్ని మాకిచ్చేయ్. నీకు ఎంతో కొంత డబ్బులిస్తాం. లేదంటే ఎక్కడా నీ దుకాణం సజావుగా సాగదు' ఇదీ కూటమి నేతల బెదిరింపులు. ఇలాంటిదే గూడూరు నియోజకవర్గంలో చోటుచేసుకుంది. వాకాడు మండలానికి నాలుగు మద్యం దుకాణాలు కేటాయించగా.. అందులో ఒక్కరికే మూడు దుకాణాలు వచ్చాయి. మిగిలిన ఒక్క దుకాణం వేరొకరికి వచ్చింది. దీంతో మూడు దుకాణాలు దక్కించుకున్న కూటమి నేత మరో దుకాణం కూడా ఇచ్చేయాలని టెండరులో మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తిపై ఒత్తిడి చేస్తున్నాడు. కాదు.. కూడదంటే నువ్వెక్కడా దుకాణం నిర్వహించలేవని, మేం చెప్పినట్టు విని దుకాణం అప్పగిస్తే నీకు అంతోఇంతో ఇస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక సదరు దుకాణ దారుడు తలలు పట్టుకుంటున్నారు.

అయ్యో.. రొయ్యో



ఒకప్పుడు ఆక్వా సాగు సిరులు కురిపించేంది.. వేలాది మంది రైతులను లక్షాధికారులగా మార్చింది. విదేశీ మారకద్రవ్యం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించేది. లాభాల బాటన పయనించిన రొయ్యల సాగు ఇప్పుడు ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ప్రభుత్వ సహకారం అందకపోవడంతో కన్నీళ్లనే మిగులుస్తోంది. యువగళం పాదయాత్రలో తాము అధికారంలోకి వస్తే రూ.1.5 యూనిట్ విద్యుత్ అందిస్తామని లోకేష్ ఆర్భాటంగా ప్రకటించడంతో ఆక్వా రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పెద్దబాబు అడుగుజాడల్లోనే చినబాబు ఇచ్చిన హామీని తుంగలో తొక్కడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. గోరు చుట్టు మీద రోకలి పోటులా వాయుగుండం కారణంగా వాతావరణం కలిసి రాకపోవడంతో తక్కువ కౌంట్‌తోనే రొయ్య హార్వెస్టింగ్ చేపడుతున్నారు. ధరలు ఆశాజనకంగా లేకపోయినా విక్రయించేస్తున్నారు. విపత్కర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కరెంట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

- రాయితీ విద్యుత్ కోసం రొయ్య రైతుల ఎదురు చూపు
- యువగళంలో యూనిట్ రూ.1.5కే ఇస్తామని లోకేష్ హామీ
- నాలుగు నెలలు గడిచినా అమలు కాని వైనం
- వర్షాల నేపథ్యంలో నష్టాలకే హార్వెస్టింగ్ చేపట్టిన రైతులు
- కరెంట్ చార్జీలు తడిసిమోపెడవుతున్నాయని గగ్గోలు

చిల్లకూరు : జిల్లాలో ఆక్వా రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ధరలు నిరాశాజనకంగా ఉండడంతో నష్టాలనే చవిచూస్తున్నారు. ఇదే విధంగా కోవిడ్ సమయంలో రొయ్యల సాగు కష్టతరంగా మారడంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేయూతనందించింది. ప్రత్యేకంగా జోన్‌లు ఏర్పాటు చేసి రైతులకు విద్యుత్ భారం తప్పించేందుకు రాయితీపై యూనిట్‌ను రూ.2లకే సరఫరా చేసింది. దీంతో ఆక్వా సాగుదార్లు ఉపశమనం పొందారు. అయితే యువగళం పాదయాత్రలో భాగంగా గూడూరు నియోజకవర్గానికి వచ్చిన లోకేష్ ఆర్భాటంగా రొయ్యల రైతులకు వరాలు కురిపించేశారు. తాము అధికారంలోకి వస్తే జోన్‌లతో పనిలేకుండా రొయ్యల సాగు చేపట్టిన ప్రతి రైతుకూ యూనిట్ రూ.1.5కే అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శిలాఫలకం కూడా వేసి ఆక్వా రైతులను ఆశ పెట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ విద్యుత్ సబ్సిడీని అమలు చేయలేదు.



యువగళంలో లోకేష్ వేసిన శిలాఫలకం

వాతావరణం.. ప్రతికూలం

వాకాడు: భారీ వర్షాల కారణంగా రొయ్యల రైతులకు వాతావరణం ప్రతికూలంగా మారింది. చలిగాలుల దాటికి రొయ్య పిల్లలు చెరువు అడుగు భాగానికి చేరుతున్నాయి. దాణాను సైతం సక్రమంగా తీసుకోలేకపోతున్నాయి. పైగా వైరస్ బారిన కూడా పడుతున్నాయి. దీంతోపాటు విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో నిత్యం జనరేటర్‌తో ఏరియేటర్లను పనిచేయించాల్సి వస్తోంది. వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదముండడంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

2వేల ఎకరాలకు ముప్పు

జిల్లావ్యాప్తంగా సుమారు 8 వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగులో ఉన్నాయి. అందులో 2వేల ఎకరాలకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. టైగర్ రొయ్య 500 ఎకరాలు, 1,500 ఎకరాలు వెనామీ రొయ్యలు సాగులో ఉన్నాయి. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ధరలు పెద్దగా లేకపోయినా రైతులను రొయ్యలు పట్టేస్తున్నారు.

నాలుగు మండలాల్లోనే అధికంగా..

జిల్లాలోని చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో అధికంగా రొయ్యల సాగు సాగుతోంది. సుమారు 30 ఏళ్ల క్రితం టైగర్ రొయ్యల సాగుతో నీలి విప్లవం ఏర్పడింది. పదేళ్ల వరకు కొనసాగింది. తర్వాత వెనామీ రొయ్య ప్రవేశించింది. ఈ రెండు రకాల సాగులో చిన్న రైతులు కూడా లక్షాధికారులయ్యారు. అయితే నకిలీ బ్రూడర్‌లు, నకిలీ ఫీడ్‌లు రావడంతో చిన్నాపెద్దా రైతులందరూ చితికి పోయారు. దీంతో గత ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు జోన్‌లు ఏర్పాటు చేసింది. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సర్టిఫికెట్‌తో పాటుగా భూమి హక్కు ఉంటే, విద్యుత్ చార్జీలను తగ్గించింది. అయితే కూటమి ప్రభుత్వం నకిలీలను అరికట్టడంలోనూ చొరవ చూపకుండా, రాయితీలు కల్పించకుండా విదేశి ఎగుమతిదారులతో కుమ్మక్కై రైతులకు చుక్కలు చూపిస్తోంది. కౌంట్ ధరలు ఇష్టారాజ్యంగా తగ్గించి ఆక్వా రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది.

రాయితీ కోసం జోన్లు

చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 1,932 హెక్టార్‌లలో సుమారు 3,600 మంది రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. చిల్లకూరు మండలంలో తిక్కవరం, అంకుపాటూరు, ఏరూరు, కోట మండలంలో సిద్ధవరం, కర్లపూడి,కొత్తపట్నం, కొక్కుపాడు, పుచ్చలపల్లె చిట్టమూరు మండలంలో పిట్టువానిపల్లె, ఈశ్వరవాక, కోగిలి, ఆరూరు, చిట్టమూరు, ఎల్లూరు, మల్లాం, పల్లపర్తి నార్తువర్తూరు, ముక్కీటిపాళెం, వాకాడు మండలంలో కొండూరు, దుగరాజపట్నం, ముట్టెంబాక, తిరుమూరు, నామకాడు బిట్, తూపిలిపాళెం జెమీన్ కొత్తపాళెం ,గ్రామాలను జోన్‌లుగా ఏర్పాటు చేశారు. వీటిలో సాగు చేపట్టే వారికి పూర్తి స్థాయిలో రాయితీలు కల్పించాల్సి ఉంది.

వెనామీ రొయ్యల ధరలు

కౌంట్	ధర (రూ.లో)
100	245
90	255
80	265
70	305
60	325
50	350
40	390

టైగర్ రొయ్యల ధరలు

కౌంట్	ధర (రూ.లో)
10	1,000
11	900
20	520
30	420
40	330

ఇప్పటికీ అమలు చేయలేదు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జోన్లుగా ఏర్పాటు చేసి అందులోని రొయ్యల రైతు లకు రాయితీపై విద్యుత్ సరఫరా చేసింది. ఎప్పుడైనా అదనంగా బిల్లులో వచ్చినప్పటికి వాటిని అధికారులు గుర్తించి మాఫీ చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం యూనిట్‌ను రూ.1.5కే అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇప్పటికీ అమలు చేయలేదు. దీనికితోడు పలు ట్యాక్స్‌లు వేస్తోంది. దీంతో కరెంట్ బిల్లు తడిసిమోపెడవుతోంది.

– మదన్‌కుమార్‌రెడ్డి, తిక్కవరం, చిల్లకూరు మండలం

అవగాహన లేదు

ఆక్వా సాగుదారులకు రాయితీపై గతంలో రూ.2లకు యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తున్న విషయం తెలుసు, కానీ, యూనిట్‌కు ఎంత వసూలు చేస్తున్నారనే విషయంపై అంత అవగాహన లేదు. ఇటీవల బదిలీలలో బాగంగా ఇక్కడకు వచ్చా. ఆక్వాకు విద్యుత్ సరఫరా గురించి ఏమీ తెలియదు. ప్రభుత్వం జీఓ విడుదల చేసుంటే అలాగే రాయితీపై విద్యుత్‌ను సరఫరా చేస్తాం.

– శేషాద్రి, విద్యుత్‌శాఖ ఏఈ, చిల్లకూరు

పీజీ విద్యార్థులకు ఆర్‌బీఐ బంపర్ ఆఫర్

- నెలకు రూ.20వేల స్టయిఫండ్

తిరుపతి సిటీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యువతక శుభవార్త చెప్పింది. ఆర్‌బీఐ సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను ప్రకటించింది. ఇందులో ఎంపికైన యువతకు వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనుంది. నెలకు రూ.20 వేలు ఉచితంగా స్టైఫండ్ అందించనుంది. ఈ ప్రోగ్రాంకు పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులను అర్హులుగా ప్రకటించింది. ఇందులో ప్రధానంగా మేనేజ్‌మెంట్, స్టాటిస్టిక్స్, లా, ఎకనామిక్స్, ఎకనామెట్రిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్ లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు అభ్యసిస్తున్న వారి ని అర్హులుగా ప్రకటించింది. ఆర్‌బీఐ ప్రతి ఏడాదీ 125 మంది విద్యార్థులకు సమ్మర్ ఇంటర్న్ షిప్ కింద శిక్షణ ఇస్తూ స్టైఫండ్ అందిస్తోంది. అర్హులైన విద్యార్థులు డిసెంబర్ 15వ తేదీలోపు ఆర్‌బీఐ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

'దీవెన' విడుదలకు డిమాండ్

తిరుపతి సిటీ : విద్యారంగంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటి వరకు విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద నగదు విడుదల చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. లేకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయని, పేద విద్యార్థులు రూ.వేలు చెల్లించే పరిస్థితుల్లో లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు కళ్ల తెరచి పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన, తల్లికి వందనం నిధులు విడుదల చేయాలని స్పష్టం చేస్తున్నాయి.

నేటి నుంచి 'అమరవీరుల సంస్మరణ'

తిరుపతి క్రైమ్ : జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎస్పీ సుబ్బరాయులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు సంస్మరణ దినోత్సవాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. తొలుత 21న విధి నిర్వహణలో మరణించిన అమరవీరులకు నివాళులర్పిస్తామన్నారు. 22న అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తామని, 24 నుంచి 27 వరకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 26, 27 తేదీల్లో ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్, 28న పోలీస్ మెడికల్ క్యాంపు, బ్లడ్ బ్యాంకు చేపట్టనున్నట్లు వివరించారు. 29వ తేదీన సెమినార్లు ఉపన్యాసాలు పోలీస్ త్యాగాలపై పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 31వ తేదీన జాతీ ఐక్యత పరుగు పందెం నిర్వహించనున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు, పక్కన ఏఎస్పీ వెంకటరావు

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 80,741 మంది స్వామివారిని దర్శించుకోగా 31,581 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.45 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. నిర్దేశించిన సమయానికే భక్తులు క్యూలోకి వెళ్లాలని టీటీడీ కోరింది.

క్లుప్తంగా

ఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన కారు

తిరుమల: తమిళనాడుకు చెందిన కారు ఘాట్‌రోడ్డులో అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని ప్రమాదానికి గురైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడుకు చెందిన భక్తులు కారులో తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మొదటి ఘాట్ రోడ్డు మీదుగా తిరుమల నుంచి తిరుపతికి బయలుదేరారు. వీరి వాహనం 15 మలుపు వద్దకు చేరగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బ్యారికేడ్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని భక్తులకు స్వల్పగాయలయ్యాయి. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అంబులెన్స్లో అశ్విని ఆస్పత్రికి తరలించారు. కారును పక్కకు తొలగించి.. వాహన రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు విచారిస్తున్నారు.

కింద పడి కార్మికుడి మృతి


మణికంఠ మృతదేహం

ఏర్పేడు : భవన నిర్మాణానికి సెంట్రింగ్ పని చేస్తూ కార్మికుడు కింద పడి మృతి చెందిన ఘటన మండలంలోని ఐఐటీ ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఆదివారం జరిగింది. ఐఐటీ ఎదురుగా హర్షవర్ధన్‌రెడ్డి నూతనంగా ఒక అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా, వినుకొండ మండలం, ముమ్మిడివరం గ్రామానికి చెందిన గాలి మణికంఠ(29) 6వ అంతస్తులో సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రమాదశాత్తు కింద పడిపోయాడు. తిరుపతిలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయచంద్ర తెలిపారు.


సత్యవేడు మండలం కొత్తమారికుప్పంలో నిర్వహించిన పల్లె పండగలో శ్రీపతిబాబు, చంద్రశేఖర్‌నాయుడు (ఫైల్)


నారాయణవనంలో చేపట్టిన పల్లె పండగలో భాగంగా రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం (ఫైల్)

సత్యవేడు టీడీపీలో అయోమయం!

సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ముగ్గురు నేతల వర్గపోరులో నలిగిపోతున్నారు. ఎవరి వెంట నడవాలో అర్థం కాక అయోమయానికి లోనవుతున్నారు. ఒకవైపు సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్యే ఆదిమూలం.. మరోవైపు ఎన్నికల పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రశేఖర్‌నాయుడు.. ఇంకోవైపు కో–ఆర్డినేటర్‌గా నియమితులైన శ్రీపతిబాబు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఎవరి మాట వినాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

- త్రిముఖ నాయకత్వంపై దిక్కుతోచని శ్రేణులు
- ఎవరి వెంట నడవాలో తెలియక అవస్థలు
- ఆదిమూలం సస్పెన్షన్ ఎత్తివేతకు ఎదురుచూపులు
- పరిశీలకుడు, కో–ఆర్డినేటర్ తీరుపై మండిపడుతున్న ఎమ్మెల్యే వర్గీయులు

వరదయ్యపాళెం : సత్యవేడులో టీడీపీకి గతంలో ఎన్నడూ లేనివిధంగా కష్టాలు ఎదురయ్యాయి. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇటీవల లైంగిక వేధింపుల ఘటనలో అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు. ఆయనపై వేటు పడడంతో స్థానిక నేతలు, కార్యకర్తల్లో స్తబ్దత ఆవరించింది. ఈ క్రమంలోనే టీడీపీ సత్యవేడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన శ్రీపతిబాబును నియమించారు. అలాగే సార్వత్రిక ఎన్నికల సమయంలో పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రశేఖర్ నాయుడు కూడా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. దీంతో ఎవరి నాయకత్వంలో పనిచేయాలో అర్థంకాని స్థితిలో టీడీపీ కేడర్ కొట్టుమిట్టాడుతోంది.

అటా.. ఇటా.. ఎటు..?

సస్పెన్షన్ వేటు పడిన ఎమ్మెల్యే ఆదిమూలం వైపు ఉండాలా..? కో–ఆర్డినేటర్ శ్రీపతిబాబు మాట వినాలా..? నియోజకవర్గ పరిశీలకుడిగా హల్‌చల్ చేస్తున్న చంద్రశేఖర్ నాయుడు వెంట నడవాలా..? అనే సందిగ్ధంలో తమ్ముళ్లు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో శ్రీపతి బాబు, చంద్రశేఖర్‌నాయుడు యథేచ్ఛగా పాల్గొంటున్నారు. స్థానిక కార్యకర్తలను వెంటబెట్టుకుని మొత్తం 7 మండలాల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే ఆదిమూలం అనుకూలురైన కొందరు ముఖ్య నేతలను సైతం వారు తమ వెంట తిప్పుకుంటున్నారు. దీనిపై ఎమ్మెల్యే వర్గీయులు మండిపడుతున్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలోనే అధికారిక కార్యక్రమాలు

ఇటీవల పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే ఈ కార్యక్రమాల్లో కో–ఆర్డినేటర్ శ్రీపతిబాబు, పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు పాల్గొనడంపై ఎమ్మెల్యే వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగానే అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేస్తున్నారు. ఏ హోదా లేని వ్యక్తులు ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని విమర్శిస్తున్నారు. ఈ మేరకు పలు సందేశాలు సోషల్ మీడియాలో సైతం కొద్దిరోజులుగా చక్కర్లు కొడుతున్నాయి.

కుట్ర చేశారని ఆగ్రహం

కోనేటి ఆదిమూలం లైంగిక వేధింపుల ఘటనలో చిక్కుకోవడం వెనుక ఎన్నికల సమయంలో పరిశీలకుడిగా వ్యవహరించిన వ్యక్తి హస్తం ఉన్నట్లు ఎమ్మెల్యే అనుచర వర్గం బహిర్గతం చేసింది. అలాంటి వ్యక్తి ఎన్నికల తర్వాత కూడా నియోజకవర్గంలో పెత్తనం చెలాయించడం ఏంటని ఎమ్మెల్యే వర్గీయులు, దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. లైంగిక వేధింపులపై ఆరోపణలు చేసిన మహిళే కోర్టులో అన్నీ అసత్యాలను అంగీకరించి రాజీ చేసుకుందని గుర్తుచేస్తున్నారు. త్వరలోనే ఆదిమూలంపై సస్పెన్షన్ కూడా పార్టీ అధిష్టానం తొలగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే రాజీ కుదిరి దాదాపుగా నెలరోజులు పూర్తి కావస్తున్నప్పటికీ సస్పెన్షన్ మాత్రం అలాగే కొనసాగుతోంది. దీంతో 7 మండలాల్లోని ముఖ్య నేతలు మెల్లగా కో–ఆర్డినేటర్, పరిశీలకుడి వెంట వెళుతుండడం గమనార్హం.

తెర వెనుక నాలుగో నేత!

సత్యవేడు నియోజకవర్గ బాధ్యతలకు తెరచాటున సూళ్లూరుపేటకు చెందిన పారిశ్రామికవేత్త నాయకత్వం వహిస్తున్నారు. ఎమ్మెల్యే సస్పెన్షన్‌లో ఆయన పాత్ర కీలకమైంది. అధికారుల బదిలీలు.. ముఖ్యమైన పనులు ఆయన కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. గ్రావెల్ క్వారీలు, కంకర క్వారీలు కూడా ఆయన అనుచర వర్గానికే దక్కుతున్నాయి. పక్క నియోజకవర్గానికి చెందిన పారిశ్రామికవేత్త తెరచాటు మంత్రాగం నడుపున్నా స్థానిక నేతలు ప్రశ్నించలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాలిక ఆచూకీ లభ్యం



తిరుపతి క్రైమ్: నగరంలోని కొర్లగుంటకు చెందిన బాలిక అదృశ్యమైన కేసును పోలీసులు ఛేదించారు. బాలికను సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన బాలిక శనివారం తప్పిపోయిందని పోలీస్ కమాండ్ కంట్రోల్ కి తల్లిదండ్రులు సమాచారమిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గుత్తి, గుంతకల్ మధ్యలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో బాలిక ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ఆపై అక్కడి పోలీసులు, స్నేహితుల సహాయంతో బాలికను చేరదీశారు. వెంటనే ఈ విషయాన్ని ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. దగ్గర్లో ఉన్న ప్రత్యేక పోలీస్ బృందాలు బాలికను తీసుకువచ్చి సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తిరుపతి పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

వరదయ్యపాళెం : మండలంలోని నెల్లటూరులో ఈ నెల 8వ తేదీన ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన గురవయ్య (41) మద్యం తాగేందుకు డబ్బుల కోసం భార్యతో గొడవ పడ్డాడు. ఆమె నగదు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది గడ్డి మందు తాగేశాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన గురవయ్యను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రైవేట్ టెండర్లతో ఏపీ సీడ్స్ నిర్వీర్యం

శ్రీకాళహస్తి : వ్యవసాయరంగానికి తలమానికంగా వెలుగొందిన ఏపీ సీడ్స్ కార్పొరేషన్‌ను ప్రైవేట్ టెండర్లతో నిర్వీర్యం చేస్తున్నారని ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి పీవీ సుందరరామరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని ఏపీ సీడ్స్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్షలాది టన్నుల విత్తనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యం గల ప్రాసెసింగ్ యూనిట్లను మూతవేసి, ప్రైవేటు విత్తనదారులకు ద్వారాలు తెరవడం దారుణమన్నారు. ఎగుమతులు, దిగుమతులకు ప్రైవేటు టెండర్లను ప్రవేశపెట్టడంపై ప్రశ్నించినా అధికారులు లెక్కచేయడంలేదని మండిపడ్డారు. అధికారుల దురుసు ప్రవర్తనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ సీడ్స్ కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపించి రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. ఏపీసీడ్స్ హమాలీలకు చట్టబద్ధత కల్పించాలని సూచించారు. సమావేశంలో ఈశ్వర్‌రెడ్డి, నరసింహమూర్తి, రామచంద్రయ్య, నాగేశ్వరరావు, గురవయ్య, హరిబాబు, గౌరి పాల్గొన్నారు.

హోరాహోరీగా టీటీడీ బ్యాంకు ఎన్నికలు


సమావేశమైన టీటీడీ విశ్రాంత ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ బ్యాంకు ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఈ నెల 28వ తేదీన పోలింగ్ నేపథ్యంలో అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ఓటర్లను కలుసుకుని మద్దతు సమీకరించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతల సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్‌గా పోటీ చేస్తున్న ఆర్.కిషోర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మునిరెడ్డి, మదన్‌మోహన్, దేవదాసు, ఈతమాకుల శైలేంద్ర యాదవ్, వెంకటకృష్ణ (చిన్ని), బాబు, దొడ్డా రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బ్రహ్మానంద, తోట వెంకటేశ్వర్లు,పాటకం వెంకటేష్,ఆముదాల తులసీరామ్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వెంకటగిరి(సైదాపుర) : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన ఫైసల్, ఉన్నికృష్ణ అనే వ్యక్తులు ఒడిశా నుంచి గంజాయి తీసుకుని కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో వెంకటగిరి వచ్చారన్నారు. తిరుపతికి వెళ్లేందుకు లారీలు ఆపుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందితుల నుంచి 21.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో పాల్గొన్న ఎస్ఐ సుబ్బారావు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారని వివరించారు.

ముగ్గురు ఎర్రదొంగల అరెస్ట్

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలు మార్గంలో ఆదివారం ఎర్రచందనం తరలిస్తున్న కారు, బైక్‌తోపాటు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మరో ఇద్దరు పరారైనట్లు వెల్లడించారు. నిందితుల నుంచి 14 ఎర్రదుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో కూంబింగ్‌ను పకడ్బందీగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా గుర్తుతెలియని వ్యక్తి మృతి

తిరుమల: తిరుమలలోని కర్ణాటక సత్రం సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తిరుమల వన్ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సుమారు 50 ఏళ్ల ఓ వ్యక్తి మృతదేహంపై పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 9440796769 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంపై ఫిర్యాదు

నాయుడుపేటటౌన్ : మేనకూరు యూనియన్ బ్యాంకు మేనేజర్, క్యాషియర్‌పై బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరి నిర్లక్ష్యం కారణంగా సైబర్ నేరగాళ్ల చేతిలో తాను రూ.1,62,300 నష్టపోయినట్లు పేర్కొన్నాడు. బాధితుడు గణపతి రఘుయామయ్య అలియాస్ గురునాథం మాట్లాడుతూ బ్యాంకు రుణానికి చెల్లించాల్సిన వాయిదా నిమిత్తం ఖాతాలో నగదు వేశానన్నారు. బ్యాంకు వాళ్లు రుణ వాయిదాను జమ చేసుకోకపోవడంతో ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కాజేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు వివరించాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నాయుడుపేటటౌన్ : మండలంలోని నరసారెడ్డిరండ్రిగ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో తడకుప్పం గ్రామానికి చెందిన ధర్మ న్, అతడి తల్లి మల్లికాంబ గాయపడ్డారు. శనివారం తల్లీకుమారుడు బైక్‌పై నెల్లూరుకు వెళుతుండగా ఆటో ఢీకొంది. క్షతగాత్రులకు వైద్యం కోసం చెన్నైకు తరలించారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ ఇంటిపై టీడీపీ నేతల దాడి

- రాత్రివేళ కర్రలు, కత్తులతో ఇంటికి వెళ్లి తలుపులు ధ్వంసం
- చంపేస్తామంటూ బెదిరింపులు


చిల్లకూరులో సత్యనారాయణరెడ్డి ఇంటి వద్ద గుమికూడిన జనం

పెళ్లకూరు: నెల్లూరు డీసీసీబీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇంటిపై టీడీపీ నేతలు దాడికి తెగబడ్డారు. ఆదివారం రాత్రి పెళ్లకూరు మండలం చిల్లకూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. రాజకీయ కక్షలను దృష్టిలో పెట్టుకుని టీడీపీ నేతలైన దువ్వూరు రాకేష్ రెడ్డి, శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, పునబాక గ్రామానికి చెందిన లోకేష్‌నాయుడు, వడ్డిపాళెంకు చెందిన దయాకర్ తదితరులు ఆదివారం రాత్రి కర్రలు, కత్తులతో సత్యనారాయణరెడ్డి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో సత్యనారాయణరెడ్డి భార్య ఒక్కరే ఇంట్లో ఉండడం, ఇంటి తలుపులు మూసి ఉండటంతో వాటిని కాళ్లతో తన్నుతూ.. కర్రలతో కొడుతూ »బయటకు రారా చంపేస్తాం« అంటూ సత్యనారాయణరెడ్డిని ఉద్దేశించి కేకలు వేశారు. అరుపులు విన్న గ్రామస్తులు సత్యనారాయణరెడ్డి ఇంటికి వెళ్లగా.. వారిని చూసిన టీడీపీ నేతలంతా కారులో తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే, గ్రామస్తులు కారును అడ్డుకుని బైఠాయించారు. సమాచారం అందుకున్న నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రివేళ ఇలా ఇంటిపైకి వచ్చి దౌర్జన్యానికి పాల్పడటం ఏమిటంటూ టీడీపీ నేతలను గ్రామస్తులు ప్రశ్నించారు. దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. కారులో ఉన్న రాకేష్‌రెడ్డిని, లోకేష్‌నాయుడును అక్కడ నుండి పోలీసులు తప్పించి జీపులో ఎక్కించుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే, గ్రామస్తులంతా కారుకు అడ్డంగా బైఠాయించి దౌర్జన్యానికి పాల్పడిన రాకేష్ రెడ్డిని, లోకేష్‌నాయుడును తిరిగి చిల్లకూరుకు తీసుకొచ్చేంత వరకు కారును వదిలేది లేదంటూ భీష్మించారు. ఇదిలావుండగా.. సత్యనారాయణరెడ్డి శుభకార్యానికి హాజరయ్యే నిమిత్తం చెన్నై వెళ్లారు. దాడి సమాచారం తెలుసుకుని హుటాహుటిన గ్రామానికి బయలుదేరారు.

తమ్ముళ్ల రాయబేరాలు!

తిరుపతిలోని కొంకచెన్నాయిగుంట కబ్జా కోరల్లో చిక్కుకుంది. టీడీపీ నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా ఆక్రమణలకు గురైంది. అధికారుల అండతో పచ్చమూక చెలరేగిపోతోంది. నకిలీ పత్రాలతో ఇష్టారాజ్యంగా ప్లాట్లు విక్రయించేసింది. అక్కడితో ఆగకుండా స్థలాలు కొనుగోలు చేసిన వారిపై రెవెన్యూ సిబ్బందిని ఎగదోలుతోంది. మళ్లీ తామే కలగజేసుకుని సదరు ప్లాటు సొంతం కావాలంటే రూ.లక్షలు ముట్టజెప్పాలని బేరసారాలు సాగిస్తోంది. ఈ నేపథ్యంలోనే కోర్టు తీర్పును సైతం బేఖాతరు చేస్తోంది.

- ఆక్రమణలే ఆదాయ వనరుగా కుయుక్తులు
- రూ.కోట్ల చెరువులో యథేచ్ఛగా కబ్జాలు
- కోర్టు తీర్పును సైతం బేఖాతరు
- అధికారుల అండతో రెచ్చిపోతున్న పచ్చమూక


కొంకచెన్నాయి గుంట చెరువులో ఆక్రమణలను జేసీబీ సాయంతో తొలగిస్తున్న దృశ్యం(ఫైల్)

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలో అతి విలువైన చెరువు.. కొంకచెన్నాయిగుంట. ఈ ప్రాంతంలో నివాస స్థలాలకు మంచి డిమాండ్ ఉండడంతో టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా ఆక్రమించుకున్నారు. గతంలో పట్టాలు పొందిన మాజీ సైనికోద్యోగులను సైతం ఆ స్థలంలోకి అడుగుపెట్టనివ్వలేదు. అంతటితో ఆగకుండా తప్పుడు పత్రాలు సృష్టించి ప్లాట్లు వేసి అమ్మి సొమ్ముచేసుకున్నారు. ఈ మేరకు చెరువు ఆక్రమణకు గురైందని »సాక్షి« పలుమార్లు వెలుగులోకి తీసుకువచ్చింది. కథనం ప్రచురితమైనప్పుడల్లా రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి ఆక్రమిత స్థలంలో వేసిన తాత్కాలిక షెడ్లు తొలగించి వెళ్లిపోతున్నారు. అంతకు మించి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. న్యాయస్థానం కూడా ఆ భూమి చెరువు పోరంబోకు అని స్పష్టం చేసినా... టీడీపీ బ్యాచ్ పట్టించుకోవడంలేదు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి మళ్లీ నగదు వసూలు చేసుకుంటూ మోసం చేస్తున్నారు.

నకిలీ పత్రాలతోనే..

2014 నుంచి టీడీపీ నేతల ఆక్రమణలు మరింత జోరందుకున్నాయి. కొంకచెన్నాయిగుంట భూమిని స్వాంత్ర్య సమరయోధులు తమకు అమ్మేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించుకున్నారు. కొందరు కమ్యూనిస్టు పార్టీల నేతల సహకారంతో దాదాపు 35 మందికి ఈ భూమిలో వేసిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేశారు. అంకణం రూ.30వేల నుంచి రూ.50వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఇక అప్పటి నుంచి స్థల కొనుగోలు చేసిన వారు గృహ నిర్మాణం చేపట్టడం.. రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం.. టీడీపీ నేతలు బేరాలు సాగించి నగదు వసూళ్లకు పాల్పడడం నిత్యకృత్యంగా మారిపోయింది. ఈ విధంగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి అదనంగా రూ.2.30లక్షల చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. టీడీపీ నేతల అరాచకాలపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ తొలగించాల్సిందే..

కొంకచెన్నాయిగుంట చెరువులో నిర్మిస్తున్న ఓ ఇంటిని గురువారం రెవెన్యూ అధికారులు తొలగించారు. మిగిలిన ఆక్రమణలను పట్టించుకోలేదు. దీనిపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కబ్జా చేసిన స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలన్నీ తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

దశాబ్దాల క్రితమే..

తిరుపతి అర్బన్ మండలం కొంకచెన్నాయిగుంట పరిధిలో సర్వే నంబర్ 173/3లో 2.50 ఎకరాల చెరువు పోరంబోకు ఉంది. నగరం విస్తరించడంతో చెరువు పక్కనే ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. ఈ భూమిని 1992లో శ్రీకాళహస్తికి చెందిన 35 మంది స్వాతంత్ర్య సమరయోధులకు అప్పటి ప్రభుత్వం నివాస స్థలాల కింద పట్టాలు ఇచ్చింది. వారు ఇళ్ల నిర్మాణం చేపడుతుండగా అప్పట్లోనే టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఆ భూమిని సుబ్రమణ్యం అనే వ్యక్తి 1983లో తమకు విక్రయించారని పత్రాలు చూపించారు. దీంతో స్వాతంత్ర్య సమరయోధులు ఆ భూమిని వదిలేశారు.


8 పర్యాయాలు ఆక్రమణ

కొంకచెన్నాయిగుంట చెరువును టీడీపీ నేతలు ఇప్పటి వరకు 8 పర్యాయాలు ఆక్రమించుకున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం రెవెన్యూ ఉద్యోగులు ఆక్రమిత స్థలంలో నిర్మించిన ఒక్క ఇంటిని మాత్రమే తొలగించారు. మిగిలిన నిర్మాణాల జోలికి వెళ్లలేదు. దీంతో వెంటనే టీడీపీ, జనసేనకు చెందిన ముఖ్య నేతలు రంగంలోకి దిగేశారు. రూ.7లక్షలు ఇస్తే రెవెన్యూ, పోలీసు అధికారులు మీ జోలికి రారని ఒక పార్టీవారు.. ఇంటికి రూ.5లక్షల చొప్పున చెల్లిస్తే అన్నీ తామే చూసుకుంటామని మరోపార్టీ వారు బేరాలకు దిగారు.

కోర్టు తీర్పును సైతం..

కొంకచెన్నాయిగుంట చెరువు పోరంబోకును ఆక్రమించుకున్న టీడీపీ నేతలు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు కోర్టు చేపట్టిన విచారణలో రెవెన్యూ అధికారులు పకడ్బందీగా రికార్డులు అందజేశారు. ఆ భూమికి సంబంధించి ఎవరికీ పట్టాలు జారీ చేయలేదని స్పష్టం చేశారు. దీంతో న్యాయస్థానం కూడా ఆ భూమి చెరువు పోరంబోకు అని తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ టీడీపీ నేతలు మరోసారి నకిలీ పత్రాలు సృష్టించి మళ్లీ కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది.

సహించే ప్రసక్తే లేదు



చెరువు స్థలంలో అక్రమ నిర్మాణాలను సహించే ప్రసక్తే లేదు. ఎంతటి వారిదైనా వెంటనే తొలగిస్తాం. కొంకచెన్నాయిగుంటను పూర్తి సర్వే చేయిస్తాం. కబ్జాలన్నీ తొలగించి స్వాధీనం చేసుకుంటాం. ఆ ప్రాంతంపై నిఘా పెట్టాలని ఇప్పటికే వీఆర్ఓలను ఆదేశించాం. ఈ క్రమంలోనే నగర పరిధిలోని అన్ని చెరువులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. చెరువులో వేసిన ప్లాట్లను కొనుగోలు చేసి ఇబ్బంది పడవద్దని ప్రజలను కోరుతున్నాం.

– కేపీ భాగ్యలక్ష్మి, తహసీల్దార్, తిరుపతి అర్బన్